విలేఖరులు కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాదాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394 సంప్రదించగలరు
ఎడిటర్ చల్లా శ్రీకాంత్

RNI : APBIL/2023/86665
రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
గుంటూరు, సంపుటి : 01 సంచిక : 314 | శుక్రవారం 27 డిశంబర్ 2024 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00
GUNTUR VOL-01 ISSUE - 314 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 27 FRIDAY DECEMBER 2024 PAGES : 8 Rs :2-00



# పులివెందులలో జగన్ ప్రజాదర్బార్

అమరావతి: ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇవాళ వైఎస్సార్ జిల్లా పులివెందులలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నాలుగు రోజుల జిల్లా టూర్ లో ఉన్న వైఎస్ జగన్ .. తన సొంత నియోజకవర్గం పులివెందులలో స్థానికుల నుంచి చాలా కాలం తర్వాత ఫిర్యాదుల్ని స్వీకరించారు.దీంతో జనం కూడా జగన్ ను కలిసేందుకు భారీగా తరలివచ్చారు. క్రిస్మస్ పండుగ జరుపుకునేందుకు సొంత జిల్లాకు వెళ్లిన జగన్.. అందులో భాగంగా నేతలతో ఇప్పటికే భేటీలు నిర్వహించారు.వైఎస్సార్ జిల్లా టూర్ లో ఉన్న వైఎస్ జగన్ పులివెందులలోని వైఎస్ అవినాష్ రెడ్డి క్యాంపు కార్యాలయానికి వచ్చారు. నాలుగు రోజులుగా నియోజకవర్గంలోనే ఉన్న జగన్.. ఇవాళ క్యాంప్ ఆఫీసుకు రావడంతో జనం కూడా భారీగా తరలివచ్చారు. దీంతో పులివెందుల వీధులు కిక్కిరిసిపోయాయి. స్థానిక సమస్యలపై జనం ఎక్కువగా ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వం మారాక పులివెందులలో పరిస్థితులపై వారు ఫిర్యాదులు చేస్తున్నట్లు సమాచారం.వైఎస్సార్ జిల్లాతో పాటు రాయలసీమలోని ఇతర జిల్లాల నుంచి కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రజాదర్బార్ కు తరలివచ్చారు. దీంతో జగన్ కూడా వారి నుంచి వినతులు స్వీకరించారు. ఓపిగ్గా వారు చెబుతున్న సమస్యలు వింటున్నారు. రాష్ట్రంలో సీఎంగా ఉండగా తీరిక లేని షెడ్యూల్స్ తో పులివెందులలో ప్రజా దర్బార్ నిర్వహించలేక తో సోదరుడు, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డితో ఏర్పాటు చేయించేవారు. జనం కూడా జగన్ కు చెప్పుకోవాల్సిన విషయాలు అవినాష్ కు చెప్పుకునే వారు. అధికారం కోల్పోయాక జగన్ ప్రస్తుతం నేరుగా జనంతో భేటీ అయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు.



# నామినేటెడ్ పదవుల జాబితా సిద్ధం - లిస్టులో ఉన్నదెవరు..

అమరావతి: ఎన్డీఏ పార్టీల నేతలకు సీఎం చంద్రబాబు నూతన సంవత్సర కానుక ఇవ్వనున్నారు. మూడు పార్టీ ల నుంచి నామినేటెడ్ పదవుల కోసం నిరీక్షిస్తున్న వారికి గుడ్ న్యూస్ సిద్దమైంది. ఇప్పటికే ఖరారు చేయాల్సిన పదవులు.. వ్యక్తుల గురించి బీజేపీ, జనసేన నుంచి చంద్రబాబుకు జాబితాలు అందాయి. చంద్రబాబు - పవన్ మధ్య చర్చలు జరిగాయి. దీంతో, పెద్ద మొత్తంలో నామినేటెడ్ పదవులను ప్రకటించేందుకు తుది కసరత్తు జరుగుతోంది.

**చంద్రబాబు కసరత్తు** :కొత్త సంవత్సరం వేళ చంద్రబాబు కూటమి పార్టీ నేతలకు గుడ్ న్యూస్ చెప్పేందుకు సిద్దమ య్యారు. ఈ సారి జాబితా పెద్ద సంఖ్యలో ఉంటుందని తెలుస్తోంది. గత రెండు జాబితాల్లో జనసేన, బీజేపీల కంటే..టీడీపీ నేతలకే ఎక్కువగా పదవులు దక్కాయి. కానీ, టీడీపీ నుంచి పదవులు ఆశిస్తు న్న వారి సంఖ్య భారీగా ఉంది. ఈ సారి జాబితాలో తమకు న్యాయం జరుగుతుందనే ఆశతో ఉన్నా రు. ఎమ్మెల్సీ పదవులు కోసం పోటీ ఎక్కువగా ఉంది. దీంతో, ఎవరికి ఎమ్మెల్సీ పదవులు ఇవ్వాలి.. ఎవరిని నామినేటెడ్ పదవులకు ఎంపిక చేయాలనేది క నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**వారికే పదవులు** : టీడీపీ నుంచి ఎన్నికల సమయంలో కూటమి అభ్యర్దుల కోసం సీట్లు త్యాగం చేసిన వారికి ఈ లిస్టు లో ప్రాధాన్యత దక్కనుంది. పిఠాపురం వర్మ, దేవినేని ఉమా, బుద్దా వెంకన్న, మేకపాటి చంద్రశేఖర రెడ్డి లాంటి వారు ఉన్నారు. రాష్ట్ర స్థాయిలో ఉన్న 60 కార్పోరేషన్ల పదవుల కోసం పోటీ ఎక్కువగా కనిపిస్తోంది. అందులో బేవరేజెస్ కార్పోరేషన్, ఆప్కాబ్, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పోరేషన్, బ్యూటిఫికేషన్ అండ్ గ్రీనరీ కార్పోరేషన్, డైరీ డెవలప్మెంట్ కార్పోరేషన్, షీప్ అండ్ గోట్ కార్పోరేషన్ పదువులు ఉన్నాయి. వీటితో పాటుగా అధికార భాషా సంఘం, సాహిత్య అకాడమీ, స్కూల్ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రా కార్పోరేషన్, నెడ్ క్యాప్, ప్రణాళిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్ పదవులు భర్తీ చేయాల్సి ఉంది. ఇంకా కుల సంఘాల పదవులు ఖరారు కావాల్సి ఉంది.

**మూడు పార్టీల నుంచి** : ఈ సారి జాబితాలో మూడు పార్టీల నుంచి పదవులు ఆశిస్తున్న వారి పేర్లలో కొందరికి పదవులు ఖరారైనట్లు ప్రచారం సాగుతోంది. టీడీపీ ఆశావాహుల్లో గన్ని ఆంజనేయులు, బూరుగుపల్లి శేషా రావు, మాల్యాద్రి, దారపునేని నరేంద్ర, ఏవీ సుబ్బారెడ్డి, ప్రభాకర్ చౌదరి, సుగుణమ్మ, మాజీ ఎమ్మె ల్యే రామానాయుడు పేర్లు ఉన్నాయి. జనసేననుంచి అమ్మిశెట్టి వాసు, రాయపాటి అరుణ, రామ కృష్ణ, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, బీజేపీ నుంచి పాతూరు నాగభూషణం, అన్నం సతీష్, బాజీ, కోలా ఆనంద్ వంటి వారి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే విధంగా సీట్లు త్యాగం చేసిన నేతలు ఎమ్మెల్సీ స్థానాల పైన ఆశలు పెట్టుకుంటున్నారు. దీంతో, చంద్రబాబు ప్రకటించే జాబితా పైన ఉత్కంఠ కొనసాగుతోంది.

# ఆధారాలు లేకుండా ఈవీఎంలను నిందించలేం: సుప్రియా సూలే



న్యూఢిల్లీ : ఎలాంటి ఆధారాలు లేకుండా ఈవీఎంలను తాను నిందించలేనని ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. ఈవీఎంలపై కాంగ్రెస్ సహా పలు పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు ఈవీఎంలను నిందించడాన్ని తప్పుబట్టారు. తాజాగా, ఎన్సీపీ (శరద్ పవార్) ఎంపీ కూడా అదే రకమైన వ్యాఖ్యలు చేశారు.ఈవీఎంల ద్వారా జరిగిన ఎన్నికల్లోనే తాను నాలుగుసార్లు విజయం సాధించానన్నారు. అలాంటప్పుడు అందులో స్కాం ఉందని ఎలా చెప్పగలుగుతామని వ్యాఖ్యానించారు. ఆధారాల్లేకుండా ఈవీఎంలను తప్పుబట్టలేమన్నారు. ఈవీఎంలలో అవకతవకలపై కొంతమంది ఆరోపణలు చేస్తున్నారని, ఇందులో వాస్తవాలను బయటకు తీసుకువచ్చేలా చర్చ జరగాల్సి ఉందని సుప్రియాసూలే అభిప్రాయపడ్డారు.ఓటర్ల జాబితాపై చాలామంది ప్రశ్నలు లేవనెత్తుతున్నారని, కాబట్టి ఈవీఎం అయినా... బ్యాలెట్ పేపర్ అయినా పారదర్శకంగా జరిగితే ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయమేనని తెలిపారు. ప్రజలు బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరగాలని కోరుకుంటే అలాగే చేయాలని, ఈవీఎంలు కావాలనుకుంటే వాటినే ఏర్పాటు చేయాలన్నారు.

# వంగవీటి రంగా అందరివాడు... రాధా మాత్రం...!: పోతిన మహేశ్



అమరావతి: వంగవీటి రంగా 36వ వర్ధంతి. ఈ సందర్భంగా విజయవాడతో పాటు పలు ప్రాంతాల్లో రంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. బెజవాడలోని చెరువు సెంటర్ లో ఏర్పాటు చేసిన రంగా వర్ధంతి కార్యక్రమానికి వైసీపీ నేత పోతిన వెంకట మహేశ్ హాజరయ్యారు. రంగా విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన... రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వంగవీటి రంగా అందరివాడుగా పేరు తెచ్చుకున్నాడని, కానీ రాధా మాత్రం ఆయనకు కుటుంబ వారసుడిగానే మిగిలుపోతున్నాడని అన్నారు. రంగా ఆశయాల కోసం రాధా ముందుకురావడంలేదని, కేవలం ఎన్నికల సమయంలోనే రాధా బయటికి వస్తున్నారని వ్యాఖ్యానించారు. "రంగా సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాల్సిన వ్యక్తి... ప్రజా సమస్యలపై, కాపు సమాజ ఇబ్బందులపై మాట్లాడకపోవడం బాధాకరం. రాధా ఆలోచన ఏంటో అర్థం కావడంలేదు. కాపు వర్గం అణచివేతకు గురవుతున్నా స్పందించడం లేదు... కనీసం కాపు రిజర్వేషన్లపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదు. రంగా విగ్రహాలను ఆవిష్కరిస్తూ ఆయనకు తానే వారసుడ్నని చెప్పుకోవడం తప్ప రాధా చేస్తున్నది ఏమిటి? రంగా వారసులుగా మేం అనేక పోరాటాలు చేశాం... కానీ రాధా మాత్రం బీసీ వర్గాల భవిష్యత్తును నాశనం చేసే వ్యక్తులతో చేతులు కలపడం దురదృష్టకరం. జిల్లాకు రంగా పేరు పెట్టాలని ఒక్క మాట మాట్లాడొచ్చు కదా... కనీసం వారి పార్టీ అధికారంలో ఉన్నప్పుడైనా మాట్లాడకపోతే ఎలా! రాధా పదవి గురించి కాకుండా, ఇకనైనా తన తండ్రి రంగా ఆశయ సాధన కోసం కృషి చేయాలి" అని పోతిన మహేశ్ స్పష్టం చేశారు.

# టీడీపీ, జనసేనలు కేంద్రానికి గులాంగిరి చేస్తున్నాయి: షర్మిల



అమరావతి: కేంద్ర ప్రభుత్వంపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు. 243 మంది పని చేసే కర్ణాటక స్టీల్ ప్లాంట్ కు పెద్ద మొత్తంలో నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి... 26 వేల మంది పని చేసే వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ఆదుకోవడానికి మాత్రం మనసు రావడం లేదని దుయ్యబట్టారు. ఇద్దరు ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న జేడీఎస్ రూ. 15 వేల కోట్ల నిధులు రాబట్టిందని... కేంద్రంలోని ఎన్డీయేకు ఊపిరి పోసిన టీడీపీ, జనసేన పార్టీలు మాత్రం కేంద్రానికి గులాంగిరి చేస్తున్నాయని విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను ఆదుకోవాలని కోరుతూ 1,400 రోజులుగా కార్మికులు ఉద్యమాలు చేస్తుంటే సీఎం చంద్రబాబు మాత్రం ప్రధానితో మిట్టల్ స్టీల్ గురించి చర్చిస్తున్నారని షర్మిల విమర్శించారు. మిట్టల్ పెట్టబోయే ప్లాంట్ కు ఇనుప ఖనిజం కొరత లేకుండా చూడాలని కోరుతున్నారని... ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ను సెయిల్లో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని చెప్పారు. స్టీల్ ప్లాంట్ కు న్యాయం జరగకపోతే ఎన్డీయే నుంచి టీడీపీ, జనసేన బయటకు రావాలని డిమాండ్ చేశారు.

# 27న విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త నిరసన జయప్రదం చేయాలి: సజ్జల రామకృష్ణారెడ్డి



అమరావతి:కూటమి సర్కార్ విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు ఈ నెల 27న తలపెట్టిన ర్యాలీలు, వినతి పత్రాల సమర్పణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఆయన జిల్లా పార్టీ అధ్యక్షులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం వేయడం దుర్మార్గమన్నారు. పెంచిన చార్జీలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనలు నిర్వహించి వినతి పత్రాలను సమర్పించాలన్నారు. అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలు ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షుల నేతృత్వంలో ఇప్పటికే పార్టీ శ్రేణులతో సమావేశాలు జరిగాయన్నారు. అన్ని జిల్లాల్లోనూ వైసీపీ పోరుబాట పోస్టర్ల ఆవిష్కరణలు నిర్వహించారన్నారు. వైసీపీ చేపట్టిన ఈ నిరసనలపై ఇప్పటికే ప్రజల్లో ఆదరణ కనిపిస్తోందని సజ్జల అన్నారు. ప్రజా సమస్యలపై వైసీపీ బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. విద్యుత్ చార్జీల పెంపు భారం అన్ని వర్గాలపై పడుతోందన్నారు. దీంతో ఆయా వర్గాలు వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. వీరంతా వైసీపీ తలపెట్టిన నిరసనల్లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ క్రమంలో ప్రజా సంఘాలు, సంస్థలను కలుపుకుని నిరసన ప్రదర్శనలు పెద్ద ఎత్తున నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు.



# పవన్ పైనే 'మెగా' భారం- కీలక భేటీ, ఛలో అమరావతి

అమరావతి: టాలీవుడ్ లో సంక్రాంతి టెన్షన్ మొదలైంది. సీఎం రేవంత్ తన వైఖరి తేల్చి చెప్పారు. బెనిఫిట్ షోలు.. టికెట ధరలకు అవకాశం లేదని క్లారిటీ ఇచ్చారు. అసెంబ్లీలో చేసిన ప్రకటనకే కట్టుబడి ఉన్నానని స్పష్టం చేసారు. దీంతో, ఇప్పుడు టాలీవుడ్ లో సంక్రాంతి సినిమాల పైన ఉత్కంఠ పెరుగుతోంది. రేవంత్ నిర్ణయంతో ఏపీ ప్రభుత్వం పైనా ఒత్తిడి మొదలైంది. ఇప్పుడు టాలీవుడ్ .. మెగా ఆశలు అన్నీ పవన్ పైనే. డిప్యూటీ సీఎం గా పవన్ ఏం చేయబోతున్నారు.. పరిశ్రమకు ఈ కష్ట కాలంలో ఎలా అండగా నిలుస్తారనేది ఆసక్తి కరంగా మారుతోంది.

**రేవంత్ తేల్చేయటంతో** :ఈ సారి సంక్రాంతి పెద్ద హీరోల సినిమాలు విడుదల అవుతున్నాయి. కొన్నేళ్లుగా ప్రముఖ హీరోల సినిమాలకు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బెనిఫిట్ షో లు.. టికెట్ ధరల పెంపు సాధారణ ప్రక్రియ గా మారింది. కానీ, తాజాగా పుష్ప -2 ప్రీమియర్ షో తొక్కిసలాట, మహిళ ప్రాణాలు కోల్పోవటం, తాజా పరిణామాలతో తెలంగాణ ప్రభుత్వం తమ రాష్ట్రంలో బెనిఫిట్ షో లు.. టికెట్ ధరల పెంపు కు నో చెప్పింది. ఈ రోజు సినీ ప్రముఖుల సమావేశంలోనూ ఈ నిర్ణయంలో మార్పు లేదని సీఎం రేవంత్ తేల్చి చెప్పారు. తెలుగు సినిమాలకు తెలంగాణ పెద్ద మార్కెట్ గా ఉంది. అదే విధంగా ఏపీ ప్రభుత్వం పైన రేవంత్ నిర్ణయం తో పరోక్షంగా ఒత్తిడి పెరుగుతోంది.

**సంక్రాంతి సినిమాలు** : దీంతో, సంక్రాంతి సినిమాల పైన టెన్షన్ పెరుగుతోంది. ఈ సంక్రాంతికి రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్', బాలకృష్ణ డాకూ మహారాజ్, వెంకటేశ్?సంక్రాంతికి వస్తున్నాం, సందీప్ కిషన్ మజాకా సినిమాలు రేసులో ఉన్నాయి. గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాలకు దిల్ రాజు నిర్మాత. కాగా, 'డాకూ మహారాజ్' మూవీకి నైజాంలో డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నారు. ప్రస్తుతం రేవంత్ తో తెలంగాణ ఎఫ్డీసీ ఛైర్మన్ గా ఉన్న దిల్ రాజ్ జోక్యంతో తాజా సమావేశం జరిగింది. కానీ, అసలు ఫలితం దక్కలేదు. దీంతో.. ఇప్పుడు ఏపీ పైనే ఆశలు పెరుగుతున్నాయి. ఈ సమయంలో ఏపీలో డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్ టాలీవుడ్ కు గేమ్ ఛేంజర్ గా కనిపిస్తున్నారు.

**పవన్ పైనే ఆశలు** : పవన్ కల్యాణ్ తో సినిమా పెద్దల సమావేశానికి రంగం సిద్దమవుతోంది. ఇందు కోసం ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ తో సమావేశానికి సినీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 30న అమరావతిలో సమావేశం జరిగే అవకాశం ఉందని సమాచారం. అయితే, రేవంత్ నిర్ణయం తరహా లోనే చంద్రబాబు వ్యవహరించాలని ఇప్పటికే పలు డిమాండ్లు తెర మీదకు వచ్చాయి. దీంతో, సినీ పెద్దలు అప్రమత్తం అయ్యారు. ఏపీ ప్రభుత్వంతో భేటీకి బాలయ్య ను తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో, ఇప్పుడు పవన్ ఏ విధంగా టాలీవుడ్ కు అండగా నిలుస్తారు.. ఏపీ ప్రభుత్వం నిర్ణయం ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాలి

రాయల్ జర్నలిజంపుట్టపర్తి :జిల్లాలో బాల్యవివాహాలు నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా ఎస్పీ వి రత్న, డిఆర్ఓ విజయ సారథి, ఐసిడిఎస్ పిడి సుధా వరలక్ష్మి లతో కలిసి బాల్య వివాహాల నిర్మూలనపై సమన్వయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలోబాల్య వివాహాల ను అరికట్టేందుకు ప్రణాళిక బద్ధంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఆర్డిఓలు, సిడిపివోలు, అంగన్వాడీ కార్యకర్తలు, పోలీసులు మరియు గ్రామాల్లో ఉన్న బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులు కీలక పాత్ర వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో గత జనవరి నుండి ఇప్పటివరకు 105 బాల్యవివాహాలు నిలుపుదల జరిగినట్లు తెలుస్తోందని అయితే గ్రామాల్లో ఉన్న పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, మహిళా పోలీసులు, వీఆర్వోలు ప్రత్యేక దృష్టిని పెట్టి జిల్లాలో పూర్తిగా బాల్యవివాహాలు లేకుండా అరికట్టుటకు కృషి చేయాల అన్నారు. ప్రతినెల డివిజన్, మండల స్థాయిలో కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, బాల్య వివాహాలు మరియు బాలికలపై జరుగుతున్న లైంగిక నేరాలు తదితర వాటిపై సంబంధిత శాఖ అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించి వాటిని నిర్మూలించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు కూడా బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యతగా గుర్తించాలని కలెక్టర్ తెలిపారు.జిల్లా ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ,బాల్య వివాహ నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. బాల్య వివాహాలు చేసిన తల్లిదండ్రులతో పాటు ప్రోత్సహించే వారు కూడా శిక్షార్హులేనని తెలిపారు. చట్ట ప్రకారం 18 సంవత్సరాల వయసు నిన్ననే అమ్మాయికి 21 సంవత్సరాలు నిండని అబ్బాయిలకు వివాహాలు చేయడం బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం నేరమని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, పెనుగొండ ఆర్డిఓ ఆనంద్, కదిరి ఆర్డిఓ శర్మ, ధర్మవరం ఆర్డీవో మహేష్ డిఆర్ డిఎ పిడి నర్సయ్య, డిపిఓ సమత, వివిధ శాఖ అధికారులు , డిసిపిఓ మహేష్ పిఓ మురళి, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పొలం పిలుస్తుంది కార్యక్రమం



రామసముద్రం డిసెంబర్ 26 రాయల్ జర్నలిజం: మండలంలోని ఎలావానెల్లూరు గ్రామ పంచాయతీలో గురువారం సర్పంచ్ ఉదయ్ శంకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఏ ఓ మోహన్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఓకే పంటను పండించ కుండా మార్కెట్ లో డిమాండు ను బట్టి పంటలు సాగు చేస్తే రైతుకు మంచి ఆధాయం పొందడానికి వీలుకలుగుతుందన్నారు.రైతులు చీడ పీడలు తగ్గించడానికి తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలనీ అలాగే రక్షణ పంటలు వేయడం వలన ప్రధాన పంటలకు చీడ పీడలు ఆశించడం తగ్గుతుందని తెలిపారు.రబి సీజన్ నుండి పంటల భీమాను రైతులు ప్రభుత్వం నిర్ణహించిన ప్రీమియం చెల్లించి భీమా సదుపాయం పొందాలని కోరారు.మండలంలోని వరి, వేరుశనగ,టమోటా మామిడి పంటలకు రభీ 2024 -2025 సీజన్లో రైతులకు భీమా వర్తిస్తుందని తెలిపారు.అలాగే ప్రతి రైతు తప్పని సరిగా పంట నమోదు చేసుకోవాలని తద్వారా అన్నిపథకాలు వర్తిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉదయ్ శంకర్ రెడ్డి, ఏ ఓ మోహన్ కుమార్, ఈశ్వర్,వి ఏ ఏ మధు, జిల్లా రామకృష్ణ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారానికి కృషి




రామసముద్రం డిసెంబర్ 26 రాయల్ జర్నలిజం: రామసముద్రం మండలం ఎలావానెల్లూరు గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఉదయ్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. తాహిసీల్దార్ నిర్మాలాదేవి మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవిన్యూ సదస్సులను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ భూములు పరిష్కారానికి గ్రామ రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల తాహిసీల్దార్ నిర్మాలాదేవి అన్నారు. ఎలావానెల్లూరు గ్రామంలో గురువారం రెవిన్యూ సదస్సు నిర్వహించారు.భూ సమస్యలకు సంబందించిన పత్రాలు ఇచ్చి నమోదు చేసుకోవాలన్నారు. 20 అర్జీలు వచ్చాయని త్వరగా పరిస్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తాహిసీల్దార్ నిర్మాలాదేవి,సర్పంచ్ ఉదయ్ శంకర్ రెడ్డి మండల సర్వేయర్ నాగరాజు, ఆర్ ఐ వషీం అక్రమ్, వి ఆర్ వో మోహన్, ఎంపిటీసీ పద్మ ఈశ్వర్, మధు, జిల్లా రామకృష్ణ,డాక్టర్ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశాధినేతల్ని సాగనంపిన జనం-భారత్‌లో గట్టెక్కిన మోడీ..!

న్యూఢిల్లీ : ఈ ఏడాది అంతర్జాతీయంగా మారుతున్న ప్రజల మనోభావాలకు అద్దం పట్టింది. ముఖ్యంగా అంతర్జాతీయంగా పలు దేశాల్లో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఈ ఏడాది ఆరంభంలో అధికారంలో ఉన్న అధినేతలు కాస్తా ఏడాది మధ్యకు వచ్చేసరికి మాజీలుగా మారిపోయారు. విపక్షంలో ఉన్న పలువురు రాజకీయ నేతలు వారి స్థానాల్లో ఆయా దేశాధినేతలు అయ్యారు.ఈ ఏడాది చివర్లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమెక్రాటిక్ పార్టీని కాదని రిపబ్లికన్లకు జనం పట్టం గట్టారు. దీంతో జో బైడెన్ స్థానంలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అటు బ్రిటన్ లో వరుసగా ప్రధానులు మారడంతో విసుగెత్తిన జనం ఈసారి లేబర్ పార్టీకి పట్టం గట్టారు. దీంతో కైర్ స్టార్మర్ కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. శ్రీలంకలో జరిగిన ఎన్నికల్లో జనం ఈసారి కమ్యూనిస్టులకు అండగా నిలిచారు. దీంతో అనుర దిశనాయకే అధ్యక్షుడిగా పగ్గాలు



అందుకున్నారు.భారత్ లో జరిగిన ఎన్నికల్లో మాత్రం అధికార ఎన్డీయే కూటమికి ప్రజలు మరోసారి ఓటేశారు. అయితే మెజార్టీ మాత్రం బాలీగా తగ్గింది.అయినా కూటమిలో టీడీపీ, జేడీయూ సహకారంతో వరుసగా మూడోసారి ప్రధానిగా మోడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు జూన్, జూలైలో ఫ్రాన్స్ లో జరిగిన ఎన్నికల్లో హంగ్ పార్లమెంట్ తప్పలేదు. దీంతో అధ్యక్షుడు మాక్రాన్ ఫ్రాంకోయిస్ బేరూను ప్రధానిగా నామినేట్ చేశారు. దక్షిణాఫ్రికాలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్, జపాన్ లో లిబరల్ డెమోక్రాటిక్ పార్టీలు కూడా అనూహ్యంగా పరాజయాలు చవిచూసాయి.బంగ్లాదేశ్ లో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షురాలిగా షేక్ హసీనా ఎన్నికయ్యారు. అయితే ఆరు నెలలకే ప్రజా తిరుగుబాటుతో ఆమె భారత్ కు పారిపోయి వచ్చేశారు. దీంతో అక్కడ మొహమ్మద్ యూనుస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం పనిచేస్తోంది. అటు పాకిస్తాన్ లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ పీటీఐపై నిషేధంతో విడిగా పోటీ చేసిన ఆ పార్టీ మద్దతుదారుల్ని గెలిపించారు. అయినా మెజార్టీకి తగిన స్థానాలు రాకపోవడంతో నవాజ్ షరీఫ్ పార్టీ పీఎంఎల్ తరపున ఆయన సోదరుడు షెహబాజ్ షరీఫ్ ప్రధాని అయ్యారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వంగవీటి మోహనరంగా....

రాయల్ జర్నలిజం (బాపట్ల) డిసెంబర్ 26 : వంగవీటి మోహనరంగా నాడు కులాలకు, పార్టీలకు అతీతంగా ప్రజలు మెచ్చిన నాయకుడుగా పెత్తందారులు పేదవారి పై చేస్తున్న దాడులను అరికట్టి బడుగు బలహీనవర్గాలకు అండగా పోరాటం చేశారని బాపట్ల జిల్లా వై.ఎస్.ఆర్.సి.పి దివ్యాంగుల విభాగం అధ్యక్షులు చల్లా రామయ్య అన్నారు. బుధవారం వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా స్థానిక భీమావారిపాలెంలో లో గల వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా చల్లా రామయ్య మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా చేసిన పోరాటాలు ఎన్నటికీ మరువలేనివని, నాడు పెత్తందారుల మాటలు విని రిక్షా కార్మికులు, ఆటోవాళ్ళు, పేదప్రజల మీద వారి కుటుంబాల పైన కొంతమంది పోలీసులు అరాచకంగా దాడులు చేసి తప్పుడు కేసులు పెట్టి హింసించారని, ఆ సమయంలో రంగా పేదప్రజలకు ప్రజలకు చేయూతనిచ్చి అండగా నిలిచి నేడు తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిసిపోయిన నాయకుడు వంగవీటి మోహనరంగా అని అన్నారు. ప్రతి ఒక్కరూ కూడా ఒక కులానికో పార్టీలకో పరిమితం కాకుండా ఈ తరం నాయకులందరూ కూడా రంగా ను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు జరిగే అన్యాయాలను అరికట్టాలని ప్రజలకు అండాదండగా మేలు చేసే నాయకులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో చల్లా శ్రీనివాసరావు, భోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆకురాతి విష్ణుమూర్తి, కత్తుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాద బాధిత కుటుంభానికి చేయూత నందించిన "జై భీమ్ జర్నలిస్ట్ ఫెడరేషన్"



రాయల్ జర్నలిజం (బాపట్ల) డిసెంబర్ 26 : రోడ్డు ప్రమాదంలో బాలుడు మరణించి, తండ్రి హాస్పిటల్ లో చికిత్స పొందుతూ పుట్టెడు దుక్కంలో మునిగిఉన్నవారి కుటుంబానికి కొంతమేరైనా ఆర్థికంగా సహాయ-సహకారాలు అందజేయాలన్న సంకల్పంతో జై భీమ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తరపున ఆర్దిక సహాయాన్ని అందచేశామని అధ్యక్ష్యులు చెల్లి అశోక్ కుమార్ అన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 25 వ తేదిన ఎంతో సంతోషం గా క్రిస్మస్ పండుగ జరుపుకోవలసిన ఆరితోటి ప్రవీణ్ కుమార్ కుటుంభం లో రోడ్డు ప్రమాదం కారణంగా విషాదం చోటుచేసుకోవటం ఎంతో బాదాకరమని, కుమారుని కోల్పోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన కుటుంబానికి తమ వంతుగా కొంతమేర ఆర్దికంగా నైనా ఆదుకోవాలన్న సంకల్పం తో "జై భీమ్ జర్నలిస్ట్ ఫెడరేషన్" తరపున ప్రవీణ్ కుమార్ తల్లిదండ్రులకు 11,500 రూపాయలు అందజేశామని ఆయన తెలిపారు. అనంతరం కోండ్రు శ్రీకాంత్ మాట్లాడుతూ బాపట్ల ఆనంద నగర్ కు చెందిన ఆరితోటి ప్రవీణ్ కుమార్ భార్య బిడ్డలతో కలిసి చీరాల వెళ్లి క్రిస్మస్ షాపింగ్ చేసి తిరిగి వస్తున్న తరుణంలో చీరాల పట్టణంలోని కారంచేడు ఫ్లైఓవర్ మీద ఆర్టిసి బస్సు ఢీకొనడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందగా బాలుని తండ్రి ప్రస్తుతం గుంటూరు లలిత హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడని, ఈ మేరకు బాధిత కుటుంబానికి గురువారం "జై భీమ్ జర్నలిస్ట్ ఫెడరేషన్" తరఫున ఆర్థిక సహాయం చేసామాని తెలిపారు. ఈ కార్యక్రమం లో చెల్లి అశోక్ కుమార్, జంగం దాసు, కత్తి రాజు, కోట షాలేం రాజు, కోండ్రు శ్రీకాంత్, జ్యోతి ప్రసాద్, పెరికల బాబు, కాగిత స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.



# వంగవీటి మోహన రంగా 36 వ వర్ధంతికి బాపట్లలో ఘన నివాళ్ళు



రాయల్ జర్నలిజం (బాపట్ల) డిసెంబర్ 26 : పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పరితపిస్తూ అశువులు బాసిన గొప్ప నాయకుడు వంగవీటి మోహన రంగా అని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు గాదె వెంకటేశ్వరావు అన్నారు. బుధవారం వంగవీటి మోహన రంగా 36 వ వర్ధంతి సందర్భంగా బాపట్ల పట్టణం భీమవారిపాలెం లోని వంగవీటి మోహన రంగా విగ్రహానికి బాపట్ల కాపు సంఘం నాయకులతో కలిసి పుల మాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరావు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా వెలుగొంది, వారి అభివృద్ధి కోసం అనునిత్యం పరితపిస్తూ అశువులు బాసిన మహోన్నతమైన వ్యక్తి స్వర్గీయ వంగవీటి మోహన రంగా అని కొనియాడారు. శాసనసభ్యునిగా ప్రజా నాయకునిగా ఉంటూ కూడా పేదల పక్షాన పోరాటాలకు చిరునామాగా నిలిచిన ఏకైక వ్యక్తి స్వర్గీయ వంగవీటి అని తెలియ జేశారు. 26 డిసెంబర్ 1988 వ తేదీన పేదల కోసం దీక్ష చేపట్టిన వంగవీటి రంగాను కొంత మంది దొడ్డి దారిన వచ్చి హతమార్చడం హేయమైన చర్య అని అన్నారు. ఆపద్బాంధవుడిగా నిరుపేదల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న వంగవీటి మోహన రంగా లేని లోటు తీర్చలేనిది అని తన సంతాపాన్ని



వ్యక్త పరిచారు. కాపు సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు మరియు పలువురు వక్తలు వంగవీటి ఘన చరిత్ర గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల కాపు సంఘం అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు, సీనియర్ నాయకులు ఆలపర్తి శ్రీనివాసరావు, ప్రముఖ న్యాయవాది భీమా లీలా కృష్ణా, కోటికలపూడి సురేష్, ఎన్ జి ఓస్ నాయకులు రాయుడు,



ఇమ్మడి శెట్టి శ్రీనివాసరావు, భీమా వేంకటేశ్వర రావు,



చిలకల సురేంద్ర, అంజనేష్ , సురేంద్ర, తోట కృష్ణా బాపట్ల నియోజకవర్గ కాపు కమిటీ సభ్యులు మరియు జనసేన పార్టీ శ్రేణులు తో కలిసి ఘనమైన నివాళులు అర్పించి జోహార్లుతో హొరెత్తించారు.

రాయల్ జర్నలిజం దినపత్రిక ROYAL JOURNALISM

# టార్గెట్ సంక్రాంతి

**జిల్లాలో గుంతలు లేని రోడ్లు నిర్మాణ పనులను సంక్రాంతి నాటికి వేగవంతంగా పూర్తి చేయాలి**

**రోడ్లు మరమ్మతుల పనుల్లో నాణ్యత పాటించాలి**

**జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్**



**తిరుపతి,**రాయల్ జర్నలిజం గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన మిషన్ హోల్ ఫ్రీ (గుంతల రహిత ఆంధ్ర ప్రదేశ్) కార్యక్రమ%శీ%పై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ఆ దిశగా జిల్లావ్యాప్తంగా గుంతలు లేని రోడ్ల పనులను సంక్రాంతి నాటికి పూర్తిచేసేలా చూడాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్ అండ్ బి అధికారులు, నేషనల్ హైవే పి డి లు, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజనీర్ లతో మిషన్ హోల్ ఫ్రీ పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా గుంతలు లేని రోడ్ల పనులను పూర్తిచేసి పురోగతిలోకి తీసుకురావాలని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా రోడ్ల మరమ్మతుల విషయంలో ఎలాంటి అలసత్వం లేకుండా వెంటనే పూర్తి కావాలని తెలిపారు. రహదారుల మరమ్మతులు, అభివృద్ధి పనులకు సంబంధించిన మెటీరియల్ నాణ్యతతో పాటు రహదారులు ఎక్కువ కాలం మన్నేలా నాణ్యత పనులను చేపట్టేలా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

# పర్యాటక అభివృద్ధిలో కీలక భాగస్వాములు కావాలి

**ప్రత్యేక ప్యాకేజీ రూపకల్పనకు కృషి చేస్తున్నాం**

**హోటళ్ల యాజమానులతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ,**రాయల్ జర్నలిజం ఎన్‌టీఆర్ జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమంలో హోటళ్ల యాజమానులు కీలక భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. నగరంలోని వివిధ హోటళ్ల యజమానులతో సమావేశమయ్యారు. జిల్లాకు పెద్దఎత్తున పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి జిల్లాను పర్యాటక హబ్ గా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని.. ప్రత్యేక పర్యాటక ప్యాకేజీని అమలు చేసేలా ఆలోచన చేస్తున్నామని అన్నారు. జిల్లాలో కనక దుర్గమ్మ దేవాలయంతో పాటు భవానీ ద్వీపం, కొండపల్లి బొమ్మల తయారీ కేంద్రం, కొండపల్లి ఖిల్లా వంటి ప్రముఖ పర్యాటక కేంద్రాలున్నాయని.. జిల్లాలోని పర్యాటక కేంద్రాలలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి మరింతమంది పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ప్రత్యేక ప్యాకేజీతో ట్యాక్సీ, వాహన యజమానులతో పాటు ఆతిథ్య రంగ అభివృద్ధికీ అవకాశముంటుందన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో ఉపాధి అవకాశాల సృష్టి జరుగుతుందన్నారు. ప్యాకేజీ రూపకల్పనకు భాగస్వామ్య పక్షాలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నామని.. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వివరించారు.సమావేశంలో జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి ఆర్‌వీ స్వామి, వి.రాఘవేంద్ర,హోటల్ ఐలాపురం ప్రతినిధి రాజా, బిందు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# డిఎం అండ్ హెచ్ ఓ గా మాలిని

**కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన మాలిని**



**ఏలూరు,**రాయల్ జర్నలిజం ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు డా. మాలిని. ఆపై జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ని కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో గురువారం పూలమొక్కను అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పేదప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందేలా చూడాలని, ముఖ్యంగా మాతా, శిశు మరణాల నియంత్రణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ డా. మాలిని కి సూచించారు.

# సక్సెస్‌గా రెవిన్యూ సదస్సులు

**కలెక్టర్ తమీమ్ అన్సారియా**




**ఒంగోలు,** రాయల్ జర్నలిజం : రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇస్తూ శాశ్వత పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటున్నట్లుజిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం మార్కాపురం మండలం, బోడపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, స్థానిక శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి తో కలసి హాజరై భూ సమస్యల పై ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత సమస్యల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 6 నుండి జనవరి 8 వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సు లు నిర్వహించడం జరుగుచున్నదన్నారు. ఏ రోజు ఏ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించడం జరుగుతుందో షెడ్యూల్ ను రూపొందించడం జరిగిందన్నారు. ఆయా గ్రామ ప్రజలకు రెవెన్యూ సదస్సు నిర్వహణ పై తెలియచేయడం జరుగుతుందన్నారు.భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంతో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.వచ్చిన ప్రతి అర్జీని ఆన్ లైన్ లో నమోదు చేసి వారికి రశీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులను, సంబంధిత రికార్డులను రెవెన్యూ సదస్సులవద్ద అందుబాటులో వుంచి తక్షణం పరిష్కరించ దగ్గఅర్జీలను పరిష్కరిస్తూ, తక్షణం పరిష్కారం చూపలేనివి నిర్దిష్ట గడువు 45 రోజుల లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. ఈ రోజు జరిగిన రెవెన్యూ సదస్సులో ఎక్కువ మ్యూటేషన్ కేసులపై వచ్చివున్నాయని, వారందరికీ కూడా ఇప్పుడే మ్యూటేషన్ కొరకు ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయడం జరిగిందన్నారు. అదే విధంగా కొన్ని సర్వే సమస్యలపై అర్జీలు రావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇస్తూ శాశ్వత పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోరారు. స్థానిక శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించి న్యాయం చేయాలన్న ఉద్దేశ్యం తో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఎంతో విజయవంతంగా సాగుతున్నాయన్నారు. బోడ పాడు గ్రామాల్లో ఈ రోజు జరిగిన రెవెన్యూ సదస్సులో సుమారు 80 దరఖాస్తులు రాగా ఏ అర్జీ పరిశీలించినా కొన్ని ఏళ్లగా పరిష్కారం కానీ సమస్యలేనని, వీటిలో సుమారు 95 శాతం సమస్యలకు పరిష్కారం అయ్యే అవకాశం ఉందన్నారు. నిజమైన హక్కు దారునికి శాశ్వత పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేలా రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బోడపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. అనంతరం జిల్లా కలెక్టర్ మార్కాపురం మున్సిపల్ పరిధిలోని చెన్నరాయునిపల్లిలోని గృహ నిర్మాణ కాలనీని సందర్శించి గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. త్వరగా ఇళ్లు నిర్మించుకునేలా సంబంధిత లబ్ధిదారులను చైతన్య పరిచి త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, తహశీల్దార్ చిరంజీవి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సులకు వచ్చిన అర్జీలు 730

**రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవిన్యూ సదస్సులు..**

**గ్రామాల అభివృద్ధిలో రెవెన్యూ సదస్సులు కీలకపాత్ర పోషిస్తాయి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి,**రాయల్ జర్నలిజం : గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 6 నుండి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి గురువారం తిరుపతి జిల్లాలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో రెవెన్యూ, భూ సమస్యలను సులభతరంగా పరిష్కరించుకోవడానికి అనువైన వేదిక రెవెన్యూ సదస్సులు అని ఈ వేదికను మండల గ్రామ స్థాయిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కొరకు జిల్లావ్యాప్తంగా నేడు 48 గ్రామ సభలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంత వాసులకు రెవెన్యూ సదస్సులు ఒక గొప్ప సువర్ణవకాశమని ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా భూమి, రెవెన్యూ సమస్యలను పరిష్కరించు కోవాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల రెవెన్యూ, సచివాలయ మరియు సంబందిత అధికారులు పాల్గొని విజయ వంతంగా రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన వివిధ సమస్యలతో కూడిన దరఖాస్తులు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చిన్న చిన్న సమస్యలు ఉన్న వాటిని అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. తిరుపతి జిల్లాలో మొదటి రోజు నుండి నేటి వరకు జిల్లావ్యాప్తంగా 12306 అర్జీలు అందాయని నేడు రెవెన్యూ సదస్సుల ద్వారా 730 అర్జీలు వచ్చాయని అందులో హౌస్ సైట్స్ పై - 114, అసైన్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ పై -45, క్యాస్ట్ వెరిఫికేషన్ - 1, రీ సర్వే పై -29, ల్యాండ్ గ్రాబింగ్ పై -11, ఆర్ ఓ ఆర్ పై - 345, ఇతర విషయాలకు సంబంధించి 129 వచ్చాయని తెలిపారు. ఈరోజు వచ్చిన అర్జీలలో 58 అర్జీల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించడం జరిగిందని మిగిలిన అర్జీల సమస్యలను కాల పరిమితి లోపల సంబందిత అధికారులు పరిష్కరిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

# కౌలు రైతులకు పంట రుణాలు మంజూరులో ప్రాధాన్యత ఇవ్వాల్సిందే

**జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశం**




**ఏలూరు,** రాయల్ జర్నలిజం కౌలు రైతులకు సాగుకు రుణాలు అందించడంలో ఖచ్చితంగా ప్రాధాన్యత ఇవ్వాల్సిందేనని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం జిల్లా బ్యాంకర్ల సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది . ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ.. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, సాగులో 90 శాతానికి పైగా ఉన్న కౌలు రైతులకు పరపతి సౌకర్యాన్ని విరివిగా అందించాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందన్నారు. జిల్లా రుణ ప్రణాళికలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్యతా రంగాలకు 15 వేల 778 కోట్ల రూపాయలు రుణాల లక్ష్యానికి గాను వ్యవసాయ అనుబంధ రంగాలకు 12 వేల 632 కోట్ల రూపాయలు రుణాలుగా అందించేందుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లాలో 65 వేల మందికి పైగా కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు జారీ చేశామని, వీరికి 240 కోట్ల రూపాయలు రుణాల లక్ష్యానికి గాను, వీరిలో కేవలం 20 వేల మంది కౌలు రైతులకు రూ 140 కోట్లను మాత్రమే చెల్లించారన్నారు. రుణ అర్హత కార్డులు అందించిన కౌలు రైతులందరికీ రానున్న రెండు నెలలలోగా తప్పనిసరిగా సాగు రుణాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పాడిపశువుల కొనుగోలుకు అవసరమైన రుణాలను రైతులకు అందించేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజి మంజూరులో నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. రుణ అర్హత కలిగిన రైతులు, పాడిరైతులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సంబంధిత అధికారులు, బ్యాంకర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రుణాల మంజూరుకు రైతులు ఎదుర్కుంటున్న సమస్యలను బ్యాంకర్లు తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ దిశగా బ్యాంకర్లు, అధికారులు కృషిచేస్తే వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను త్వరితగతిన సాధించేందుకు వీలుకలుగుతుందన్నారు. జిల్లాలో వివిధ రకాల పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ఎంతో అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని, పారిశ్రామిక ప్రగతికి దోహదపడే విధంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లను స్థాపించే వారిని ప్రోత్సహించేవిధంగా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు.

**సమావేశానికి హాజరుకాని బ్యాంకర్లకు షోకాజ్ నోటీసులు జారీ:**రైతుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నాయని, రైతులు, మహిళలు, యువత స్వయం ఉపాధి, పేదల గృహనిర్మాణం, వంటి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి వార్షిక రుణ ప్రణాళిక అమలుపై చర్చిండానికి ప్రధాన వేదికైన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశానికి కొంతమంది బ్యాంకర్లు గైర్హాజరు కావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొటాక్ మహీంద్రా బ్యాంకు, ఐడిబిఐ, డిసీబీ ,ఇండస్ ఇండ్ కరూర్ వైశ్య బ్యాంకు, తదితర బ్యాంకుల ప్రతినిధులు సమావేశానికి హాజరు కాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎల్డిఎమ్ ను ఆదేశించారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు రీజినల్ అధికారి శ్రీనివాస్, ఆర్బీఐ ప్రతినిధి నాగప్రవీణ్, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ అధికారి విజయరాజు, వ్యవసాయ శాఖ, మత్స్య శాఖ జేడీలు హబీబ్ భాష, నాగలింగాచారి, ఉద్యానవన శాఖ డిడి రామ్మోహన్, మైనారిటీస్ సంక్షేమ అధికారి కృపావరం, ఎల్డిఎమ్ నీలాద్రి, వివిధ బ్యాంకులు ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థుల ఆరోగ్య రికార్డులు నిర్వహించాలి



సీతానగరంరాయల్ జర్నలిజం వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య వివరాల రికార్డులు పక్కాగా నిర్వహించాలని, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బంది పర్యవేక్షణ చేయాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. జోగింపేటలో కెజిబివి, ఎస్ఓఈ వసతి గృహాలను గురువారం సందర్శించారు. విద్యార్థుల హీమోగ్లోబిన్ రక్త పరీక్షల నివేదికలను తరగతుల వారీగా రికార్డులో పరిశీలించి తక్కువగా నమోదు అయిన విద్యార్థుల ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని లతో మాట్లాడి ప్రతీ రోజూ ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేయిస్తున్నారా ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయా అని తెలుసుకొని సిబ్బందికి తగు సూచనలు చేశారు.విధిగా ఐరన్ మాత్రలు విద్యార్థులకు వేయించాలని, పోషకాహారం సరిగా తీసుకునేలా పర్యవేక్షణ చేయాలన్నారు.సిక్ రిజిస్టర్ పరిశీలించి విద్యార్థుల ఆరోగ్య సమస్యల వివరాలు స్పష్టంగా ఉండాలని,ఆరోగ్య సమస్య,ప్రారంభ మరియు నయమైన తేదీలు,చికిత్స ఇచ్చిన ప్రదేశం,చికిత్సా వివరాలు ఉండాలన్నారు. సిక్ రూమ్ లో ఆరోగ్య సమస్యతో ఉన్న విద్యార్థితో ఆయన మాట్లాడి అందజేస్తున్న చికిత్సా వివరాలపై సిబ్బందిని ఆరా తీసారు.అక్కడ మందులు తనిఖీ చేసారు. వసతి గృహ హెల్త్ సిబ్బంది మందుల వినియోగం, కాలపరిమితి వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించి నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న హెల్త్ స్క్రీనింగ్ ఏ మేరకు పూర్తి అయ్యిందని, ఏ విధమైన ఆరోగ్య సమస్యలు గుర్తించారని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఆరోగ్య సమస్యలు గుర్తించిన విద్యార్థుల ఆరోగ్యం మెరుగు పడేవరకు,అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య,హాస్టల్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధర్మరాజు,ఉమాదేవి, సూపర్వైజర్స్ సత్యవతి,శర్మ, వైద్య సిబ్బంది చైతన్య,మీనా తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సబ్సిడీపై పెట్రోల్ కు ధరఖాస్తులు ఆహ్వానం



పార్వతీపురం,రాయల్ జర్నలిజం: శారీరక దివ్యాంగులు సొంత వ్యాపారం చేస్తున్నా లేదా గుర్తింపు కలిగిన ప్రవేటు సంస్థలలో పని చేస్తున్నవారికి సొంత మూడు చక్రాల మోటరైజ్డ్ వాహనం కలిగి ఉంటే పెట్రోల్ సబ్సిడీకి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కె. కవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత గల శారీరక దివ్యాంగులు - విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్ణీత ధరఖాస్తు ఫారము పూర్తి చేసి, ధరఖాస్తు ఫారంతో సదరం సర్టిఫికేట్, పెట్రోల్ కొనుగోలు చేసిన బిల్లులు, తెల్ల రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనము రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రము (దివ్యాంగుని పేరుతో ఉండాలి), బ్యాంకు పాసు బుక్ మొదటి పేజి, ఆధార్ కార్డు, వ్యాపారం లేదా ప్రవేటు సంస్థలో పని చేస్తున్న ధృవీకరణ పత్రము, ఒక పాస్ పోర్టు సైజ్ ఫోటో (వికలాంగత్వము కనుపడునట్లు) తదితర ధృవీకరణ పత్రాలతో సమర్పించాలని ఆమె కోరారు. వివరములకు 08942-240519 ఫోన్ నంబరుకు కార్యాలయ పని వేళలలో సంప్రదించాలని ఆమె కోరారు.

# లోన్ యాప్ మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చెయ్యాలి

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్





విజయనగరం,రాయల్ జర్నలిజం వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ డిసెంబరు 26 న గంట్యాడ పోలీసు స్టేషను సందర్శించి, స్టేషను పరిసరాలు, లాకప్ సెల్స్, ప్రాపర్టీ రూం ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మహిళా సంరక్షణ పోలీసులు, పోలీసు సిబ్బందితో మమేకమై, వారికి దత్తతగా అప్పగించిన గ్రామాల్లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, భూ తగాదాలు, గొడవలు, వివిధ రాజకీయ పార్టీల వైరం లు, పాత నేరస్తులు, హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల పేర్లు, గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం గురించి సమాచారం సేకరించి, ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. ప్రతీ వారం విధిగా దత్తత గ్రామాల్లో పోలీసులు సందర్శించాలని, ప్రజలకు లోన్ యాప్ మోసాలు, సైబరు మోసాలు, డిజిటల్ అరెస్టు, మహిళల భద్రత, రహదారి భద్రత పట్ల క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఎవరైనా సైబరు మోసానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాల్సిందిగా ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ పోలీసులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. పోలీసు సిబ్బంది సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలని, మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను ప్రజలు, విద్యార్దులకు "సంకల్పం" కార్యక్రమంతో అవగాహన కల్పించాలని ఆదేశించారు.గ్రామాల్లో సీసీ



కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాల ఏర్పాటులో స్థానిక వ్యాపారులు, ప్రజల సహకారం తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద కాషనరీ బోర్డులను, స్టాపర్స్, లైటింగ్ ఏర్పాటు చేసి, ప్రమాదల నియంత్రణకు చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు.అనంతరం, పోలీసు స్టేషనులో నమోదై, దర్యాప్తులో ఉన్న కేసులు, వివిధ న్యాయ స్థానాల్లో ట్రయల్స్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల సిడీ ఫైల్స్ ను జిల్లా ఎస్పీ పరిశీలించి, కేసుల దర్యాప్తు పూర్తి చేసేందుకు అధికారులకు దిశా నిర్దేశం చేసారు. స్టేషను పరిధిలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు ఇన్ఫార్మర్ వ్యవస్థను మెరుగు పర్చుకోవాలని, సమాచార సేకరణకు %మీత్రా%, దత్తత గ్రామ పోలీసుల సేవలను సమర్థవంతంగా వినియోగించు కోవాలన్నారు.రోడ్డు భద్రత నియమాలు ప్రతీ ఒక్కరూ పాటించాలని కోరారు. చాలా ప్రమాదాలు హెల్మెట్ ధరించని కారణంగా తీవ్రంగా గాయపడి, ప్రాణాలు కోల్పోతున్నారు. కావున, ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గంట్యాడ పోలీసులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెల్మెట్స్ అందజేసి, తప్పనిసరిగా హెల్మెట్స్ ధరించాలని, హెల్మెట్ బరువు కాదు, బాధ్యతగా భావించాలన్నారు. వివిధ స్టేషన్ రికార్డ్స్, జనరల్ డైరీ, పార్టు 1-5 రికార్డ్స్, హిస్టరీ షీట్స్, ప్రాసెస్ రిజిష్టరు, FIR ఇండెక్స్, కె డి చెక్ రిజిష్టరు, క్రైమ్ చార్ట్, క్రైమ్ అబ్స్ట్రాక్ట్, బీట్ బుక్స్ లను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తనిఖీ చేసారు.ఈ వార్షిక తనిఖీల్లో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఎస్బి సిఐ ఏవి లీలారావు, గంట్యాడ ఎస్సై సాయి




కృష్ణ మరియు ఇతర పోలీసు అధికారులు, MSPలు, దత్తత పోలీసులు పాల్గొన్నారు.

# షెడ్యూల్డు కులాల సర్వే నివేదిక సచివాలయాల్లో ప్రదర్శన

## 31వరకు అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్




విజయనగరం,రాయల్ జర్నలిజం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు షెడ్యూల్డు కులాల సర్వే నివేదికను జిల్లా వ్యాప్తంగా ఉన్న 530 గ్రామ సచివాలయాలు, పట్టణ ప్రాంతాల్లోని 96 వార్డు సచివాలయాల్లో గురువారం నాడు ప్రదర్శించి దీనిపై ఏమైనా అభ్యంతరాలు వున్నట్లయితే తెలుప వలసిందిగా కోరడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలిపారు. డిసెంబర్ 31 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించి జనవరి 6 లోగా వాటిని ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. షెడ్యూల్డు కులాల సర్వే తుది నివేదికను ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 10 న ప్రచురించే టందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామ వార్డు సచివాలయాల్లో ఎస్.సి. కులాల సర్వే నివేదిక లు అందుబాటులో ఉన్నాయని, వాటిని పరిశీలించి తమ అభ్యంతరాలు తెలియజేయ వచ్చాన్నారు.



## జాయింట్ ఎల్.పి.ఎం.ల విభజనకు..

# ఫీజు మినహాయింపు కోసం ప్రభుత్వాన్ని కోరతాం

## జె.సి. సేతు మాధవన్




విజయనగరంరాయల్ జర్నలిజం జాయింట్ ఎల్.పి.ఎం.ల సర్వే కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు దరఖాస్తు ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ తెలిపారు. గుర్ల మండలం, లవిదాంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఎల్.పి.ఎం. సబ్ డివిజన్ ల కోసం రెవెన్యూ సదస్సుల్లో అధికంగా వినతులు వస్తున్నాయని, ఫీజు మినహాయింపు ఇచ్చే అంశంపై తెలియజేస్తామన్నారు. భూ సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తోందని, ప్రజలు ఈ సదస్సుల్లో తమ భూ సమస్యలపై దరఖాస్తులు అందజేసి సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అందజేసే వినాతులపై అందించే సేవలకు ఎలాంటి రుసుము వసూలు చేయరని అందువల్ల ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. సదస్సులో తహశీల్దార్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు. నెల్లిమర్ల మండలం, సీతారాముని పేట గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా జాయింట్ కలెక్టర్ పాల్గొని రైతుల నుంచి భూ సమస్యలపై వచ్చిన వినతులను పరిశీలించి వాటిని పరిష్కరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.



# పారిజాత గిరి హుండీ ఆదాయం లెక్కింపు



జంగారెడ్డిగూడెంరాయల్ జర్నలిజం జంగారెడ్డిగూడెం ఉత్తరం వైపున ఏడుకొండలు ఆరవ కొండపై పారిజాత వృక్షాలలో వేంచేసి యున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గురువారం వేకువ జామున తిరుప్పావై ప్రవచనం ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో జరిపించారు. గురువారం ఉదయం 9 గంటలకు ఈ హుండీ లెక్కింపుకు దేవాలయ ధర్మాదాయ శాఖ ఏలూరు ఇన్స్పెక్టర్ వి సురేష్ కుమార్ ఆలయ కార్య నిర్వహణాధికారి మానికల రాంబాబు



ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిపించినారు. 90 రోజులు గాను రూ 9, లక్షల 54 వేల 726 లు హుండీల ద్వారా ఆదాయం వచ్చినట్టు కార్య నిర్వహణ అధికారి తెలియజేశారు. ఈ హుండీ లెక్కింపులో ఏలూరు విజయవాడ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ వారు కామయ్యపాలెం, పొట్ల గట్లగూడెం, సేవా సంఘం వారు ఇండియన్ బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది అర్చకులు అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు ఈ హుండీ లెక్కింపు ఆరాధన పాల్గొన్నట్లు తెలియజేసినారు.

# ఏపీలో పింఛన్ తీసుకునేవారికి శుభవార్త.. న్యూ ఇయర్ గిఫ్ట్, ప్రభుత్వం కీలక నిర్ణయం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకానికి సంబంధించి ఈ నెలలో చిన్న మార్పు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు ఈనెల 31న సిబ్బంది ఇంటింటికెళ్లి డబ్బుల్ని పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి 1న నూతన ఆంగ్ల సంవత్సరం తొలిరోజు కావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులు కూడా రిక్వెస్ట్ చేయడంతో ప్రభఉత్వం సానుకూలంగా స్పందించింది.ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్ తీసుకునేవారికి తీపికబురు. ఈసారి పింఛన్ ఒకరోజు ముందుగానే పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా 1వ తేదీన డబ్బుల్ని అందజేస్తుండగా.. ఈసారి డిసెంబర్ 31నే పింఛన్ పంపిణీ చేయనున్నారట. ఈ మేరకు ఈ నెల 30నే డబ్బుల్ని ప్రభుత్వం జమ చేయనున్నట్లు సమాచారం. నూతన సంవత్సరం రోజు కాకుండా ముందురోజే డబ్బుల్ని పంపిణీ చేయబోతున్నారట. జనవరి 1 నూతన సంవత్సరం కావడంతో.. ఈ నెల 30, 31 తేదీల్లో పింఛన్ పంపిణీ చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం నేతలు ఉన్నతాధికారుల్ని కలిసి వినతిపత్రం అందజేసి రిక్వెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని చెబుతున్నారు. ఉద్యోగులపై ఒత్తిడి కూడా ఉండదని.. అందుకే ఈ నెల 31నే పింఛన్ పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కొత్త ఏడాది సందర్భంగా ఒకరోజు ముందుగానే పింఛన్ ఇస్తే అది న్యూ ఇయర్ గిఫ్ట్‌లా కూడా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం అన్నవరంలో పర్యటించి.. స్థానికంగా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని చెబుతున్నారు. చంద్రబాబు ప్రతి నెలా 1న ఏదో ఒక జిల్లాకు వెళుతున్నారు.. అక్కడ లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే.. ఈసారి పల్నాడు జిల్లాకు వెళుతున్నారు.మరోవైపు చంద్రబాబు మూడు రోజుల క్రితం దివ్యాంగుల పింఛన్లపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారులతో సమీక్షించిన ఆయన.. దివ్యాంగుల కేటగిరీలో భారీగా అనర్హులు పింఛన్లు పొందుతున్నారని వ్యాఖ్యానించారు. అర్హత లేకుండా పింఛన్ తీసుకునేవారిని గుర్తించేందుకు ఎంత సమయం పడుతుందని చంద్రబాబు అధికారుల్ని అడిగారు. అధికారులు ఎక్కువ సమయం పడుతుందనడంతో.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా అనర్హఉల్ని గుర్తించకపోవడం ఏంటని ప్రశ్నించారు. అర్హులకు పింఛన్లు, సంక్షేమ పథకాలు అందించాలని.. అదే క్రమంలో అనర్హులపై వేటు పడాల్సిందే అంటున్నారు. మూడు నెలల్లో దివ్యాంగుల పింఛన్ల తనిఖీని పూర్తి చేయాలని సూచించారు.కొంతమంది పింఛన్లు తనిఖీ చేయడాన్ని కూడా పింఛన్లు తొలగిస్తున్నారంటూ ప్రచారం చేస్తున్నారన్నారు. అనర్హుల్ని గుర్తించి తొలగించాలని.. అలాగే అర్హులెవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.మరోవైపు ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.. రెండు నెలల పింఛన్ ఎవరైనా తీసుకోకపోతే వారు మూడో నెల కలిపి పింఛన్ పంపిణీ చేస్తున్నారు. అలాగే తల్లిదండ్రులు లేని పిల్లలకు కూడా పింఛన్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ఆదేశించారు.. ఈ మేరకు అదికారులు ఆ వివరాలను కూడా సేకరిస్తున్నారు.

# దువ్వెనతో దువ్వితే బంగారం..ఎక్కడో తెలుసా?



అమరావతి : ఒకవైపు తుఫాను వచ్చిన ప్రతిసారీ పదుల సంఖ్యలో ఇళ్ళు సముద్ర గర్భంలో కలిసిపోతుంటే మరోవైపు ప్రతి సంవత్సరం లాగే ఆనవాయితీగా సముద్ర తీరంలో బంగారం కోసం వేట సాగిస్తుంటారు ఇక్కడ మత్స్యకారులు.. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతంలో తుఫాన్లు, అల్పపీడనాలు ఏర్పడిన సందర్భాల్లో సముద్రం ఉప్పొంగి, అల్లకల్లోంగా మారినప్పుడల్లా తీరప్రాంతాలకు చెందిన మత్స్యకార పిల్లలు,పెద్దలు బంగారు రజను కోసం వెదుకులాట ప్రారంభిస్తారు. మత్స్యకారులు ఒక్కొక్కరు ఒక్కొక దువ్వెన పట్టుకొని, కెరటాలు ఒడ్డుకు వచ్చి లోపలకు వెళ్లిన సమయంలో ఇసుకపై దువ్వెనతో ఇసుకపై గీస్తారు. ఇలా గీకడం ద్వారా ఇసుక లోపల నుంచి మినుకుమినుకు మంటూ చిన్నచిన్న బంగారు రజను మత్స్యకారుల కంట పడుతుంది. దీంతో మళ్లీ సముద్రంలో కెరటం ఒడ్డుకు వచ్చేలోపు ఆ ఇసుకను ప్లాస్టిక్ ట్రేలోకి తీస్తారు. ఇలా ఒడ్డును ఉన్న ప్రతీ ఒక్కరూ ఎంతో కొంత బంగారు రజనను దక్కించుకోవడం జరుగుతుంది.ఉదయం నుంచీ సాయంత్రం వరకు ఒక్కక్కరూ కనీసం రూ. 500ల నుంచి 800 రూపాయల వరకు బంగారు రజను సేకరిస్తామని మత్స్యకారులు తెలుపుతున్నారు. పూర్వకాలం ఇక్కడో మహానగరం ఉండేదని అప్పట్లో సముద్రం ఉప్పొంగి నగరం సముద్రగర్భంలో కలిసిపోయిం దని, సముద్రం అల్లకల్లోలంగా మారినప్పుడల్లా ఇసుకలో ఉన్న బంగార ముక్కలు, ఇసుక రాపిడికి రజనుగా మారి ఒడ్డుకు చేరుతుందనే కథను మరికొందరు మత్స్యకారులు చెప్తుంటారు. ఏది ఏమైనా కాకినా కొత్తపల్లి ఉప్పాడ తీర ప్రాంతంలో పెద్ద ఎత్తున గుమీ గూడి బంగారు రచన కోసం మత్స్యకారులు జల్లెడ పడుతున్నారు.

# ఊహాకందని విధ్వంసం.. 20 ఏళ్ల తర్వాత కూడా గుండెల్లో ఆనాటి విపత్తు గాయాలు..!




అమరావతి : 2004 డిసెంబరు 26.. నిశ్శబ్దంగా ఆరంభమైన ఒక రోజు..! ఆకాశంలో చినుకు జాడ లేకపోయినా, భూమికి ఏదో పెద్ద విపత్తు ముంచుకొస్తోందన్న సంకేతాలు.. తుపాను హెచ్చరికలు లేకుండా, ఎవరికీ ఊహాజనితంగా కూడా ఏమీ తెలియకుండా హిందూ మహాసముద్రంలో అల్లకల్లోలం మొదలైంది. ఒక్కసారిగా రాకాసి అలలు ఉవ్వెత్తున ఎగసి, ప్రపంచాన్ని తలకిందులు చేశాయి.

